
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వనపర్తి జిల్లా వార్తలు
ఆదివారం 13 జూలై 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 25.0



అన్నదాతలకు అందని బోనస్

- వనపర్తి జిల్లాలో 1.82 లక్షల ఎకరాల్లో సన్న రకం సాగు
- 52 వేల మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు
- మొత్తం 2,77,336 మెట్రిక్ టన్నుల సేకరణ



వనపర్తి వ్యవసాయ మార్కెట్‌లో కాంటా చేసిన బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు (ఫైల్)

ఆత్మకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : సన్న రకం ధాన్యం పండించిన రైతులకు బోనస్ ఇప్పటి వరకు అందలేదు. సన్నరకం ధాన్యం క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన అనంతరం 2024 ఖరీఫ్ సీజన్‌లో హామీని అమలు చేసింది. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, రైతులందరికీ వారం రోజుల్లోపే బోనస్ చెల్లించింది. దీంతో రబీ సీజన్‌లోనూ అత్యధిక మంది రైతులు సన్న రకాలను ఎంచుకుని సాగు చేశారు. మొత్తం 1,77,710 ఎకరాల్లో వరి సాగయ్యింది. అందులో 69 వేల ఎకరాల్లో దొడ్డు రకం, 1,08,710 ఎకరాల్లో సన్న రకం ధాన్యాన్ని రైతులు సాగు చేశారు. ఏప్రిల్ చివరి మాసంలో ప్రభుత్వం వనపర్తి జిల్లా వ్యాప్తంగా 250కి పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. 52 వేల మంది రైతుల నుంచి 2,77,336 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ధాన్యం డబ్బును రెండు, మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కానీ సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లింపులో జాప్యం జరుగుతోంది. వానాకాలం సాగు ప్రారంభం అయి పక్షం రోజులు గడిచినా, ఇప్పటివరకు బోనస్ అందకపోవడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

పెండింగ్‌లో రూ. 49.50 కోట్లు

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి వారం రోజుల్లోగా బోనస్ డబ్బులు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటికీ రెండు నెలలు గడుస్తున్నా చెల్లించలేదు. జిల్లా వ్యాప్తంగా రైతులకు రూ. 49.50 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉంది. ఈ విషయంపై సంబంధిత అధికారులను సంప్రదిస్తే రేపు, మాపు అనడమే తప్ప, స్పష్టంగా చెప్పడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టాదారు పాసు బుక్కు కలిగిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చింది కానీ ఇవ్వాల్సిన బోనస్ మాత్రం ఇప్పటి వరకు ఇవ్వలేదని వాపోతున్నారు. ప్రభుత్వం దాని ఊసే ఎత్తకపోవడంపై అసహనం చెందుతున్నారు. వెంటనే బోనస్ చెల్లించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



వనపర్తి జిల్లా వ్యాప్తంగా రైతుల వద్ద సన్నరకం ధాన్యం కొనుగోలు చేశాం. రైతుల నుంచి ధ్రువపత్రాలు తీసుకొని ప్రతిపాదనలను రూపొందించి ఉన్నతాధికారులకు పంపించాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు బోనస్ డబ్బులు విడుదల కాగానే రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

- జగన్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి



పంటలు మొదలు పెట్టిన రైతులు

వెంటనే బోనస్ ఇవ్వాలి



రబీ సీజన్‌లో 160 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. ఇప్పటి వరకు బోనస్ రాలేదు. ఆ డబ్బులు వస్తే ఖరీఫ్ పెట్టుబడికి ఉపయోగపడుతాయని అనుకున్నాను. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే బోనస్ డబ్బులను విడుదల చేయాలి.

- ఆంజనేయులు, రైతు, గోపన్‌పేట

హామీని నిలబెట్టుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు బోనస్ ఇచ్చారు కానీ రబీ సీజన్‌లో ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం కలిగేలా రైతుల ఖాతాల్లో తక్షణమే బోనస్ డబ్బులు జమ చేయాలి.

- రాబర్ట్, తెలంగాణ రైతు సంఘం, వనపర్తి జిల్లా అధ్యక్షుడు

మొబైల్ షాప్‌లో చోరీ



- సెల్‌ఫోన్లు, ఛార్జర్లు ఎత్తుకెళ్లిన దొంగలు
- ల్యాప్‌టాప్ ధ్వంసం, మరో మూడు షాపుల్లో చోరీకి యత్నం

7

వెంకటేశ్వర మొబైల్ షాప్‌లో దొంగలు ధ్వంసం చేసిన ల్యాప్‌టాప్

మళ్లీ శంకుస్థాపనలు చేయడమేంటి?

- మంత్రులను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమేనంటూ విమర్శ

7

నల్లమల యువ కళాకారుడికి మహానంది అవార్డు

6

అసూయతోనే హత్య



తేజేశ్వర్(ఫైల్)

- తేజేశ్వర్ హత్యలో కీలక విషయాలు వెల్లడి
- తిరుమల్‌రావు బ్యాంకు నుంచి వాయిస్ చేంజర్ డివైజ్ స్వాధీనం
- ఇన్వెస్టిగేషన్ అధికారి, సీఐ టంగుటూరి శ్రీను

7

పార్టీ కోసం శ్రమించిన అందరికీ పదవులు

- టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కుసుమ కుమార్
- జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ సంస్థాగత సమావేశం



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కుసుమ కుమార్

గద్వాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం నిబద్ధతతో శ్రమించి ప్రతీ ఒక్కరికి సంస్థాగతంగా, ప్రభుత్వ పరంగా సముచిత స్థానం దక్కుతుందని టీపీసీసీ ఉమ్మడి పాలమూరు జిల్లా ఇన్‌చార్జి కుసుమ కుమార్ అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శనివారం పట్టణ సమీపంలో గల హరిత హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుసుమ కుమార్ మాట్లాడుతూ నమ్మకంతో పార్టీకి అధికారం అప్పగించిన రాష్ట్ర ప్రజలకు సుపరిపాలనతో పాటు సమగ్ర అభివృద్ధిని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా, పార్టీ బలోపేతం, గెలుపు కోసం శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలందరికీ తగిన పదవులు, అవకాశాలను కల్పించేందుకు పార్టీ రాష్ట్ర నాయకత్వం సిద్ధంగా ఉందన్నారు. కాగా, రాష్ట్రంలోని అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కొండేటి మల్లయ్య, టీపీసీసీ నాయకుడు శ్రీనివాసులు, మునిసిపల్ మాజీ చైర్మన్ బీ ఎస్ కేశవ్, నాయకులు నల్లారెడ్డి, మధుసూదన్ బాబు, ఎండీ ఇసాక్, బలిగెర నారాయణ రెడ్డి, నాగశిరోమణి, గౌస్, గట్టు కృష్ణ, ఆల్వాల్ రాజశేఖర్ రెడ్డి, డీఆర్ శ్రీధర్, శ్రీనివాస్ గౌడ్, బాలకృష్ణ ఉన్నారు.

రద్దీగా మారిన శ్రీశైలం రహదారి



మన్ననూరు చెక్‌పోస్టు వద్ద వాహనాల రద్దీ ఇలా..

- శని, ఆదివారాల్లో సెలవు దినాలు కావడంతో మల్లన్న దర్శనానికి భక్తుల బారులు
- దోమలపెంట నుంచి సున్నిపెంట వరకు ట్రాఫిక్ జామ్

దోమలపెంట/మన్ననూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శని, ఆదివారాల్లో సెలవు దినాలు కావడం శ్రీశైలం డ్యాం గేట్లు ఎత్తడంతో డ్యాం సందర్శనకు కొందరు, శ్రీశైలం మల్లన్న దర్శనానికి మరికొందరు వస్తుండటంతో శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి రద్దీగా మారింది. వేల సంఖ్యలో వాహనాలు వస్తుండటంతో దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగ, లింగాలగట్టు, డ్యాం నుంచి సున్నిపెంట వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలతో శ్రీశైలం ఘాట్ రోడ్డు రద్దీగా మారింది. దీంతో దోమలపెంట నుంచి శ్రీశైలం వరకు 25 కిలో మీటర్ల దూరం చేరుకునేందుకు ఆరు గంటలకుపైగా సమయం పడుతున్నదని భక్తులు పేర్కొంటున్నారు.



దోమలపెంటలో నిలిచిపోయిన వాహనాలు

శనివారం రాత్రి 7గంటల సమయానికి 5 వేలకు పైగా శ్రీశైలం వెళ్లి వచ్చాయని టోల్‌గేట్ నిర్వాహకులు తెలిపారు. మన్ననూరు, వటవర్లపల్లి, దోమలపెంట గ్రామాల్లోని కాటేజీలన్నీ పర్యాటకులతో నిండిపోయాయి. ఫర్హాబాద్ పులిబొమ్మ, ప్రతాపరుద్రుని కోట ఘాట్ రోడ్డు అటవీ అందాలను వీక్షించారు.

కోయిలదిన్నెను సందర్శించిన కేంద్ర బృందం సభ్యులు



కేంద్ర బృందం సభ్యులకు స్వాగతం పలుకుతున్న అధికారులు, మహిళా సంఘం సభ్యులు

వడ్డేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వడ్డేపల్లి మండలం కోయిలదిన్నె గ్రామ పంచాయతీని శనివారం సెంట్రల్ మానిటరింగ్ టీం అధికారుల బృందం బాలమురళీధరన్, రాధిక సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను, ఉపాధి హామీ పనుల యొక్క వర్క్ ఫైల్స్ పెన్షన్ ద్వారా లబ్ధి పొందుతున్న వ్యక్తులు, ఉపాధి పనులకు వెళ్లే వ్యక్తుల జాబ్ కార్డులను పరిశీలించారు. అలాగే మహిళా సంఘాల ద్వారా లబ్ధిపొందిన వారి దుకాణాలను పరిశీలించి వారితో మాట్లాడారు. 'ఉపాధి'లో భాగంగా మూడు సంవత్సరాలుగా జరిగిన పనుల్లో మొదటగా గ్రామపంచాయతీ నర్సరీ, ఫీడర్ చానల్. ఎర్తెన్ బండింగ్, గ్రామంలోని సీసీ రోడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఏపీవో మహేష్, ఏపీఎం అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



16-డీ వద్ద ఆర్‌డీఎస్ కాలువలో నిండుగా పారుతున్న నీరు

ముందే పారిన నీటితో సాగుకు సన్నద్ధం

- 20 ఏళ్ల తరువాత 3 నెలలు ముందుగా ఆర్‌డీఎస్‌కు నీరు
- నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్న ఆయకట్టు రైతులు

20 ఏళ్ల తర్వాత మూడు నెలల ముందుగానే సాగునీరు విడుదలై ఆర్డీఎస్ పరివాహక ప్రాంత రైతులకు ఊరట నింపింది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఏటా వానాకాలం పంటకు ఏరు ముందో, ఏరువాక ముందో అని చర్చించుకునేవారు. తుంగభద్ర నదికి వరద ముందు వస్తే ఆ ఏడాది పంటలు సమృద్ధిగా పండుతాయని రైతుల విశ్వాసం. నీటి విడుదలతో 45 వేల నుంచి 50 వేల ఎకరాల వరకు పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రైతులు సంతోషం వ్యక్త పరుస్తున్నారు. నారుమళ్లను కూడా సిద్ధం చేసుకుంటున్నారు. - అయిజ టౌన్, (ఆంధ్రజ్యోతి)

7

నారుమళ్లు పోసుకుంటున్నాం



ఆర్‌డీఎస్ కాలువకు ఈ ఏడాది ముందుగానే సాగునీరు రావటంతో నారుమళ్లు పోసుకుంటున్నాం. ఈ ఏడాది మాత్రం మే చివరి వారం నుంచి ఆర్‌డీఎస్‌లో నీరు పారుతూనే ఉంది. ఏరువాక కంటే ముందే ఏరు పారింది. కాబట్టి సమృద్ధిగా పంటలు పండుతాయని అనుకుంటున్నాం.

- రమేశ్, రైతు, రాజాపురం

ప్రతీ కేసుపై సీఐ అధికారి పర్యవేక్షణ తప్పనిసరి

- ఎస్పీ రావుల గిరిధర్



వనపర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌లో నమోదు అయ్యే ప్రతీ కేసుపై సీఐ అధికారి పర్యవేక్షణ ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. మొదట అధికారులతో మాట్లాడి అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ మిస్సింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... స్టేషన్‌లో నమోదయ్యే ప్రతీ కేసులో పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పోక్సో ఎస్సీ ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి 60 రోజుల్లో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతీ అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలని, ప్రతీ రోజు వచ్చే కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని సీఐలకు సూచించారు.

అదే విధంగా పోక్సో అత్యాచార కేసుల్లో జిల్లా భరోసా సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. బాధితులకు మెడికో, లీగల్ సేవలు అందిస్తూ.. వీలైనంత త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీఆర్‌బీ ఎస్ఐ తిరుపతి రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది, కమ్యూనికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్.. సీరియస్

- 65.03 శాతం ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదుతో రాష్ట్రంలో గద్వాల జిల్లాకు 15వ స్థానం
- వంద శాతం నమోదు లక్ష్యంగా కలెక్టర్ ఆదేశం

6

పుణ్యస్నానం ఆచరిస్తుండగా..

- నదిలో కొట్టుకుపోయిన వృద్ధురాలు
- చికిత్స కోసం తరలిస్తుండగా మృతి

6

కొండారెడ్డిపల్లిలో సీఎం సతీమణి పూజలు

7

పోటెత్తిన వరద

- కృష్ణానది పుష్కరఘాట్లను ముంచెత్తిన కృష్ణమ్మ



సోమశిల కృష్ణానది తీరాన ఏర్పాటు చేసిన కాటేజీలు

కొల్లాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలైన ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి వరద నీరు విడుదల అవుతుండటంతో జూరాలకు 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో జూరాల నుంచి వస్తున్న వరద నీటితో కృష్ణానదికి వరద ప్రవాహం పెరుగుతున్నది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో 882.9 అడుగుల మేర నీరు చేరడంతో కృష్ణమ్మ పరుగులు తీస్తున్న అందాలు చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు సోమశిలకు తరలివస్తున్నారు. కృష్ణానదిలో వరద ప్రవాహం పెరుగుతుండటంతో నదీ తీరం వెంట పర్యాటకులు శని, ఆదివారాల్లో సందడి చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు. అదే విధంగా కొల్లాపూర్ మండల పరిధిలోని అమరగిరి గ్రామంలో కృష్ణానది అందాలను వీక్షించేందుకు పర్యాటకులు తరలి వస్తున్నారు. పెంట్లవెల్లి మండల పరిధిలోని మల్లేశ్వరం, మంచాలకట్ట గ్రామాల్లో కృష్ణానది సముద్రాన్ని తలపించేలా కనిపిస్తుండటంతో పర్యాటకులు వీక్షిస్తూ సెల్ఫీలు తీసుకుంటూ కుటుంబ సమేతంగా ఆనందంగా గడుపుతున్నారు.



సోమశిల పుష్కర ఘాట్లను ముంచెత్తిన కృష్ణానది వరద జలాలు

మొక్కు తీర్చుకున్న ఆర్మీ ఉద్యోగి

» నరసింహస్వామికి ఆభరణాల అందజేత



నరసింహస్వామికి ఆభరణాలను అందజేసిన పోతిరెడ్డిపల్లి నరసింహ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తిమ్మాజిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామానికి చెందిన పోతిరెడ్డిపల్లి సోమేశ్వర్ అనే యువకుడు ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. దీంతో లక్ష్మీనర్సింహస్వామికి వెండి ఆభరణాలు చేయించి, మొక్కు చెల్లించుకున్నాడు. సోమేశ్వర్ తన మొదటి నెల జీతంలో రూ.20,116 విలువైన వెండి ఆభరణాలు చేయించగా, ఆఆభరణాలను శనివారం అతని తల్లిదండ్రులు విజయలక్ష్మి, నరసింహ దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనరసింహస్వామికి కళ్లు, కోరమీసాలు వంటి వెండి ఆభరణాలు అందజేయడంపై ఆలయ కమిటీ సభ్యులతో పాటుగా భక్తులు అభినందనలు తెలిపారు. వేద పండితులు గంగాధరశర్మ నరసింహస్వామికి, అండాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిలుక సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ జల్లి తిరుపతమ్మ, భాస్కర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సుందరయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల సహాయం



స్నేహితుడి భార్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న తోటి స్నేహితులు

పెద్దకొత్తపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో చనిపోతే, అతని స్నేహితులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. మండల కేంద్రానికి గడ్డిగోపుల బాలీశ్వర్(45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1995-96 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి స్నేహితులు కలిసి లక్ష రూపాయలు జమ చేశారు. బాలీశ్వర్ భార్య విజయలక్ష్మికి వారు పోగు చేసిన లక్ష రూపాయలను అందజేశారు. ఆ కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని వారు ఆమెకు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ, గడ్డిగోపుల రాముడు, దండు చంద్రయ్య, కొల్లె తిరుపతయ్య, ప్రభాకర్, ఎండి.ఖాజా, కర్ణాకర్, ఎల్లయ్య, ఎండి కరీం, బాలమల్లయ్య, శ్రీధర్‌శెట్టి తదితరులు ఉన్నారు.

నేడు రాష్ట్ర నెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే మహిళ, పురుషుల జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ ఫాస్ట్ 5 సీనియర్ నేషనల్ టోర్నీ, 2వ సీనియర్ నేషనల్ మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ హర్యానలో ఆగస్టు 28 నుంచి 31వరకు, జూలై 17 నుంచి 18వ తేదీ వరకు తమిళనాడులో నిర్వహించే 17వ సౌత్‌జోనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్, 18, 19న నిర్వహించే 2వ ఫాస్ట్ 5 సౌత్‌జోన్, 19, 20న నిర్వహించే 1వ సౌత్‌జోన్ నేషనల్ మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్ టోర్నీలో పాల్గొనే జట్ల ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఎన్ఎఫ్ఐ రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే ఎంపికలకు హాజరువుతారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు సంబంధిత ధ్రువపత్రాలతో స్టేడియంలో రిపోర్టు చేయాలని కోరారు.

24 గంటల్లో 7 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గడిచిన 24 గంటల్లో ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 7 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్లు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ శనివారం తెలిపారు. ఎగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్లను ప్రారంభించి 3.339 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి రాబట్టినట్లు తెలిపారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 112.287 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 153.126 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 3.659 మిలియన్ యూనిట్లను చేపట్టగా.. ఇప్పటి వరకు 153.126 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేపట్టినట్లు తెలిపారు. ఎగువ నుంచి ఆశించిన మేర వరద వస్తున్న కారణంగా ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో అన్ని యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని తొందరగానే చేరుకునే అవకాశం ఉందని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మక్తల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘట న పేట జిల్లా మక్తల్ మండలం లోని జక్లేర్ గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. వివ రాలిలా ఉన్నాయి. ఊట్కూర్ మండలం పులిమామిడి గ్రామానికి చెందిన గొల్ల చిన్నకిష్టప్ప తన ఎద్దులను జక్లేర్ శివారులో మేత మేపుతుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు ఎద్దు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.70 వేలు ఉంటుందని రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కారు, బైక్ ఢీ - ఇద్దరికి గాయాలు

వెల్దండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై శనివారం కారు, బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక బస్టాండ్ సమీపంలో రాచూరు వైపు వెళుతున్న కారు హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళుతున్న బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న హైదరాబాద్‌లోని కోకాపేటకు చెందిన ఆదిరాజ్, మహేందర్‌లు గాయపడ్డారు. వీరు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందారు.

టిప్పర్, పాలవ్యాను ఢీ- ఇద్దరికి గాయాలు..

వెల్దండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెర్కూర్ గ్రామ సమీపంలో శనివారం టిప్పర్, పాలవ్యాను ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. చెర్కూర్ నుంచి బర్కత్‌పల్లి వైపు వెళుతున్న టిప్పర్ ఎదురుగా వచ్చిన చెర్కూర్‌కు చెందిన పాలవ్యానును ఢీకొంది. ఈ ఘటనలో పెద్దాపూర్ గ్రామానికి చెందిన పాలవ్యాను డ్రైవరు కానుగుల శశివర్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. వెల్దండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అదేవిధంగా టిప్పర్ డ్రైవరు చెర్కూర్‌కు చెందిన సత్యనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో రైతుకు గాయాలు

వెల్దండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పోతేపల్లి గ్రామానికి చెందిన రైతు మల్లేష్‌కు విద్యుత్ ప్రమాదం జరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే... ఈనెల 6న గ్రామంలోని తమ వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జంపర్ తెగిపోయిందని హెల్పర్ రవికి మల్లేష్ సమాచారం అందించాడు. దీంతో ఎల్‌సీ తీసుకున్నానని, సరిచేసుకోమని రవి తెలిపాడు. మల్లేష్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరిచేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి కిందపడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన మల్లేష్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయంపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

రోడ్డు వచ్చిందోచ్!

» చౌల, ఏకులగట్టు తండాలకు బీటీ రోడ్డు

» ఆనందంలో గిరిజనులు



చౌలతండా మీదుగా ఏకుల గట్టు తండాకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు

భూత్పూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఆ తండాలకు రోడ్డు సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. విద్యార్థులు పాఠశా లలకు, కళాశాలలకు వెళ్లాలంటే నానా తిప్పలు పడాల్సిందే. వర్షాకాలం వచ్చిందంటే బురదమైన రోడ్డుపై ప్రయాణించాలంటే సాహసం చేయాల్సి వచ్చేది. అయితే ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని ఏకులగట్టు, చౌలతండాలకు రూ.2.20 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు మంజూరు చేసింది. అయితే రోడ్డు నిర్మాణానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ వెను వెంటనే పనులు కూడా ప్రారంభమయ్యాయి. నాగర్‌కర్నూల్ రోడ్డు నుంచి చౌలతండాకు 1.5కిలో మీటర్ దూరం ఉంది. అదే విధంగా ఏకుల గట్టు తండాకు 2.5కిలో మీటర్ దూరం అవుతుంది. ఈ రెండు తండాలతో పాటుగా కర్వెన గ్రామానికి కూడా ఈ రోడ్డు మార్గం చాలా శులభతరం అవుతుంది. రోడ్డు నిర్మాణంలో అధికారులు నాణ్యత లోపం లేకుండా జాగ్రత్త పడటంతో బీటీ రోడ్డు జాతీయ రహదా రిని పోలి ఉండటంతో తండా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా కర్వెన గ్రామస్థులకు ఈ రోడ్డు మార్గం చాలా అనుకూలంగా ఉండటంతో పాటుగా దూరం బాగా తగ్గిపోవడంతో ప్రయాణికులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఈ నిధులు మంజూరు అయినట్లుగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు.

మండలంలోని అనేక తండాలకు బీటీ రోడ్లు మంజూరు కావడం జరిగిందని, ఇక నుంచి గిరిజన తండావాసుల కష్టాలు కడతేరిన ట్లేనని గతంలో రోడ్డు శంకుస్థాపన కార్యక్రమాలకు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే గిరిజనులకు స్పష్టం చేశారు.

మా తండాకు బీటీ రోడ్డు వస్తదని అనుకోలేదు



మా తండాకు బీటీ రోడ్డు వస్తదని అనుకోలేదు. మా తండా కర్వెన రిజర్వాయర్‌లో మునిగిపోయింది. అయితే పునరావాసంలో భాగంగా కర్వెన దగ్గర కొత్తగా ఏర్పాటు చేసుకున్నాం. మా తండాకు ఇంత త్వరగా బీటీ రోడ్డు వేస్తారని అనుకోలేదు. చాలా సంతోషంగా ఉంది.

- విస్లావత్ శంకర్, ఏకులగట్టు తండా

రాత్రి పూట ఏదైనా ఆపద వస్తే బయటికి వెళ్లేవాళ్లం కాదు



మా తండా నుంచి రాత్రి ఏదైన ఆపద వచ్చిందంటే బయటికి పో వాలంటే చాలా కష్టంగా ఉండేది. అంబులెన్స్‌లు వచ్చేవి కాదు. ఇపుడు బీటీ రోడ్డు అయ్యింది. ఒక్క నిమిషంలో మెయిన్ రోడ్డుకు రావచ్చు. సంతోషంగా ఉంది.

- కొర్ర లక్ష్మీ, చౌలతండా

కర్వెన గ్రామానికి దూరం తగ్గింది



మా గ్రామానికి రావా లంటే చాలా ఇబ్బందిగా ఉండేది. ఎందుకంటే మా గ్రామానికి ఆనుకొని కురుమూర్తి రిజర్వాయర్ క డుతున్నారు. అయితే గ్రామం మీదుగా రిజర్వా యర్ నిర్మాణ పనులకు నిత్యం వేల టన్నుల భారీ లోడుతో భారీ వాహనాలు వెళ్లుతంటా యి. దీనితో రోడ్డు మొత్తం పూర్తిగా ధ్వంసం అ య్యింది. ఇప్పుడు చౌల తండా మీదుగా మా గ్రామానికి చాలా సులువుగా వెళ్లవచ్చు.

- మల్లేష్, కర్వెన, గ్రామం

నల్లమల యువ కళాకారుడికి మహానంది అవార్డు



మహానంది అవార్డును అందుకుంటున్న దాసరి శ్రీనివాసులు

మన్ననూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారాక రామారావు, భారత రత్న పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాలు-2025 తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాజ గాన సభ, కళావెంకట దీక్షితుల కళావేదికలో శనివారం నిర్వహించారు. నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని దాసరి రాజశేఖర్ అనే యువ కళాకారుడికి కోలాటాల ప్రదర్శన విభాగంలో తెలుగు వెలుగు మహానంది పురస్కారాన్ని రాష్ట్ర స్థాయి సాంస్కృతిక విభాగం ఉన్నతాధికారులచే అందుకున్నాడు. మన్ననూరు గ్రామంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన దాసరి వెంకటేశ్వర్లు, అలివేల దంపతుల చిన్న కుమారుడైన దాసరి రాజశేఖర్‌కు చిన్నప్పటి నుంచి జానపద కళా ప్రదర్శనలంటే ఇష్టం. కళాకారుడైన తండ్రి వెంకటేశ్వర్లు నుంచి కళాప్రదర్శనలు నేర్చుకున్నాడు. గ్రామాల్లోని పురుషులు, మహిళలకు కోలాటాల ప్రదర్శనలపై శిక్షణ ఇస్తూ పంతులుగా ఎదిగాడు. అవార్డును అందుకున్న రాజశేఖర్‌ను మన్ననూరు గ్రామస్థులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

» 26 సంవత్సరాల తరువాత అపూర్వ కలయిక



కొల్లాపూర్‌లో జిల్లా పరిషత్ గాంధీ స్మారక ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొల్లాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ గాంధీ స్మారక ఉన్నత పాఠశాలలో 1998-1999 విద్యా సంవ త్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 26 సంవత్సరాల తరువాత కలుసుకుని శనివారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహిం చుకున్నారు. అప్పటి గురువులను గౌరవిస్తూ శాలువా, పూల మాలతో ఘనంగా సత్కరించారు. 26 సంవత్సరాల తరువాత కలుసుకున్న వారు ఒకరికొకరు అనుభవాలు పంచుకుంటూ సంతోషం వ్యక్తపరిచారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని తన్మయత్వం పొందారు. రోజంతా ఆటలాడుతూ పాటలు పాడుతూ సంతోషంగా గడిపారు. తమతో కలిసి విద్యాభ్యాసం చేసి అనారోగ్యంతో ఉన్న తమ మిత్రులకు తామంతా అండగా ఉంటామని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగస్తులకు చీకటి రోజులు

» ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుక్‌హుస్సేన్



మాట్లాడుతున్న ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుక్‌హుస్సేన్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఉద్యోగస్తులకు చీకటి రోజులని, ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలంగాణ అల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండర్ వర్క్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుక్‌హుస్సేన్ అన్నారు. శనివారం అంబేడ్కర్ కళాభవన్‌లో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌ఖలీల్ అధ్యతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత సర్కార్ 317 జీవో తీసుకొచ్చి ఉపాధ్యాయుల జీవితాల్లో చీకట్లు మిగిల్చిందన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టును జోనల్ పోస్టుగా మార్చుతూ జీవోను సవరించి ఉపాధ్యాయుల జీవితాల్లో వెలుగులు నింపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ జేఏసీ నాయకులతో చేసుకున్న ఒప్పందాన్ని తూచా తప్పకుండా పాటించాలన్నారు. నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తేనే సమస్యలు పరిష్కరం అవుతాయన్నారు. తక్కువ బడ్జెట్ విడుదల చేయడం వల్ల రాష్ట్రంలో ఉన్నటువంటి ఉద్యోగ పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇది ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు.

దీన్ని సాకుగా తీసుకొని తెరసా మాజీ ఉద్యోగ సంఘం నాయకులు తెలంగాణ భవన్ నుంచి తెలంగాణ ఉద్యోగ సంఘం నాయకులకు ఫోన్లు చేసి రానున్నది తమ ప్రభుత్వమే అని తమకు మద్దతు ఇవ్వాలని కోరడం హాస్యాస్పదం అన్నారు.

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కోశాధికారి ఎండీ రశీద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వహిద్ షా, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ షేక్‌ఫరీద్, నిజాముద్దీన్, అహ్మద్, ఖాదర్‌వలీ, ఆరిఫ్, వహాబ్, అస్మా ఫాతిమా, ఖయ్యూం, యూసుఫ్‌బిన్‌నాసర్, అజీమ్ పాల్గొన్నారు.

పుణ్యస్నానం ఆచరిస్తుండగా..

» నదిలో కొట్టుకుపోయిన వృద్ధురాలు

» చికిత్స కోసం తరలిస్తుండగా మృతి

ఇటిక్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద కృష్ణానదిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శనివారం జడ్చర్ల పట్టణానికి చెందిన మాలే భారతమ్మ (69) బీచుపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చి కృష్ణానదిలో పుణ్యస్నానానికి వెళ్లింది. ఈ క్రమంలో కాలు జారి నదిలో కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న జాలర్లు ఆమెను ఒడ్డుకు చేర్చారు. అపస్మారక స్థితిలో ఉండగా గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కుమారుడు వేణుగోపాల్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భూత్పూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం పోతులమడుగు గ్రామ స్టేజీ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పోతులమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని గోపన్నపల్లి గ్రామానికి చెందిన తిరుమలపూరం కురుమూర్తి (45) పోతులమడుగు గ్రామ స్టేజీ దగ్గర రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న బోర్‌వెల్ లారీ ఢీకొన్నది. ఈ సంఘటనలో తిరుమలపూరం కురుమూర్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శేషమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకుందాం



శతాబ్ది ఉత్సవాలపై సమావేశమైన పూర్వవిద్యార్థులు

జడ్చర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బాదిమి రవిశంకర్ పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు, ఉత్సవాల నిర్వహణ కమిటీలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్ది ఉత్సవాల కమిటీలు తమ పనులు ప్రారంభించాలని, ముఖ్యంగా పూర్వ విద్యార్థుల వివరాలు సేకరించాలని, ఉత్సవాల నిర్వహణకు కావలసిన ఫైనాన్స్ సేకరణకు నిధులను సేకరించాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎఫ్ఆర్ఎస్.. సీరియస్

» 65.03 శాతం ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదుతో రాష్ట్రంలో గద్వాల జిల్లాకు 15వ స్థానం

» వంద శాతం నమోదు లక్ష్యంగా కలెక్టర్ ఆదేశం

» సాంకేతిక సమస్యలున్నా నమోదు కోసం ఉపాధ్యాయుల కష్టాలు



గద్వాల మండలం అనంతపురం ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా విద్యార్థి హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

గద్వాల సర్కిల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరు నమోదు పారదర్శకంగా ఉండాలన్న నిర్ణయంతో ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిషన్ సిస్టం) యాప్ ద్వారా తీసుకోవాలన్న కఠిన ఆదేశాలను విద్యాశాఖకు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదులో 33 జిల్లాల్లో జోగుళాంబ గద్వాల జిల్లా 65.03 శాతం నమోదుతో 15వ స్థానంలో నిలిచింది. కాగా వంద శాతం తప్పని సరి నమోదు లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించారు.

సాంకేతిక సమస్యలున్నా..

హాజరు నమోదును సెల్‌ఫోన్‌లోని ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా ఫొటో తీసి నమోదు చేసే క్రమంలో సాంకేతిక సమస్యలున్నప్పటికీ విద్యార్థుల ఉపాధ్యాయులు సమయాన్ని వెచ్చిస్తున్నారు. అయితే సమస్యలు రాకుండా చూడాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

మొదటి స్థానంలో గద్వాల, చివరి స్థానం రాజోలి

జిల్లా వ్యాప్తంగా 464 ప్రభుత్వ పాఠశాలలుండగా యూడైస్ లెక్క ప్రకారం 58,975 విద్యార్థులున్నారు. అయితే 57,064 విద్యార్థులకు సంబంధించి యాప్‌లో రిజిస్ట్రేషన్ అయ్యింది. విద్యార్థుల హాజరు నమోదులో గద్వాల మండలం 73.95 శాతంతో మొదటి స్థానంలో ఉండగా రాజోలి మండలం 57.83 శాతంతో చివరి స్థానంలో ఉంది.

చిక్కులకు చెక్..

ప్రధానంగా హాజరుకు తగ్గట్టుగా మధ్యాహ్న భోజనం అందించే అవకాశంతో పాటు ఎక్కడా లోటుపాట్లకు చోటు లేకుండా ఉంటుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల సంఖ్యను ఆధారంగా చేసుకుని పుస్తకాల పంపిణీ, ఏకరూప దుస్తుల సరఫరాను పక్కాగా అమలు చేసేందుకు వీలు కలుగుతుంది.

ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేయాల్సిందే



రాష్ట్ర విద్యాశాఖ తీసుకున్న కీలక నిర్ణయంతో జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరును ముఖచిత్రంతో ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా నమోదు చేయాల్సిందే. కలెక్టర్ ఆదేశానుసారం వంద శాతం నమోదుకై చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. అన్ని మండలాల ఎంఈవోలు, ఉపాధ్యాయులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా విద్యార్థుల హాజరు పారదర్శకంగా ఉంటుంది.

- అబ్దుల్ ఘని, ఇన్‌ఛార్జి డీఈవో

అయ్యో పాపం.. భానుచందర్‌గౌడ్

» దరఖాస్తు చేసుకున్నా అందని దివ్యాంగుల పింఛన్



వీల్‌చైర్‌పై భానుచందర్‌గౌడ్

ధన్వాడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఫించన్‌కు అన్ని అర్హతలు ఉన్నప్పటికి ఆ బాలుడు పింఛన్‌కు నోచుకోవడం లేదు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రానికి చెందిన జుట్ల భానుచందర్‌గౌడ్‌కు నడవడానికి ఏమాత్రం రాదు. 14 ఏళ్ల వయస్సున్న ఈ బాలుడు వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. శారీరక దివ్యాంగుడైన భానుచందర్‌గౌడ్‌కు దివ్యాంగ ఫించన్ మంజూరు చేయాలంటూ అతడి తల్లిదండ్రులు పలుమార్లు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికి దాదాపు ఐదింటికి పైగా అధికారులకు దరఖా స్తులు సమర్పించారు. కానీ దివ్యాంగుల పింఛన్‌ను అతడు నోచుకోవడం లేదు. ప్రతీసారి దరఖాస్తు చేసుకోవడమే తప్ప రావడం లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని పలువురు కోరుతున్నారు.

క్రైం కార్నర్

మొబైల్ షాప్‌లో చోరీ

- సెల్‌ఫోన్లు, ఛార్జర్లు ఎత్తుకెళ్లిన దొంగలు
- ల్యాప్‌టాప్ ధ్వంసం, మరో మూడు షాపుల్లో చోరీకి యత్నం



ఫోన్లు ఎత్తుకెళ్లిన వెంకటేశ్వర మొబైల్ షాప్

అమరచింత, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అమరచింత మండల కేంద్రంలో దొంగలు శనివారం మధ్య రాత్రి కలకలం సృష్టించారు. ఉదయం ఎప్పటిలాగా వెంకటేశ్వర మొబైల్ షాప్ యజమాని షాపు తెరవడానికి వెళ్లగా.. తాళం తెరిసి పక్కన పడి ఉండడం, షటర్ పెకిలించినట్లు కనబడడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న వెంకటేశ్వర మొబైల్ షాప్‌లో తాళాలు పగలగొట్టి షాప్‌లో రిపేర్‌కు వచ్చిన ఐఫోన్లు, శామ్‌సాంగ్, వీవో, ఒప్పో తదితర విలువైన 12 ఫోన్లను చోరీ చేయగా.. షాప్‌లో చార్జర్లు, పలు మొబైల్‌కు సంబంధించిన సామగ్రిని ఎత్తుకెళ్లారు. అంతే కాకుండా షాప్‌లోని ల్యాప్‌టాప్‌ను దొంగలు ధ్వంసం చేశారు. అక్కడి నుంచి మణెమ్మ పండ్ల దుకాణం తాళం పగలగొట్టి చిల్లర డబ్బులను ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న హర్షిత మొబైల్ షాప్, వీరేష్ ఇంటర్నెట్ సెంటర్, విపని జిరాక్స్ సెంటర్ షట్టర్‌లను పెకిలించి తెరిచే ప్రయత్నం చేశారు. ఆ షట్టర్లు తెరుచుకోకపోవడంతో దొంగలు వదిలేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాములు పేర్కొన్నారు.

రూ.12 లక్షల విలువైన సిగరెట్లు చోరీ

అయిజ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని మేడికొండ చౌరస్తాలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. జయలక్ష్మి ఏజెన్సీకి చెందిన షట్టర్లను పగులగొట్టి 20 కాటన్ల సిగరెట్లను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వాటి విలువ రూ.12 లక్షల వరకు ఉంటుందని వివరించారు. ఏజెన్సీ యజమాని వినయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మక్తల్‌లో భారీ చోరీ



మక్తల్‌లో చోరీకి గురైన ఇల్లు

మక్తల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మక్తల్ పట్టణానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఆసుపత్రి అవసరం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి నారాయణపేటకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా అప్పటికే తాళం విరగ్గొట్టి ఉంది. బీరువా వద్దకు వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో ఉన్న 12 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.30 వేల నగదు చోరీకి గురైంది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం సంఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. తాళం వేసిన ఇళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

అగ్రహారం తండాలో విషాదఛాయలు



వర్షిత్ నాయక్ (ఫైల్)

చారకొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం గేట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని అగ్రహారంతండాకు చెందిన నేనావత్ వర్షిత్‌నాయక్ (21) మహేశ్వరం నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నాడు. మహేశ్వరం గేట్ వద్ద ఎదురుగా వస్తున్న క్రమంలో డీజిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతను చెన్నైలోని యూనివర్సిటీలో ఇటీవలే ట్రిపుల్ ఐటీ పూర్తి చేశాడు. మృతుడి తండ్రి బన్సీలాల్‌నాయక్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు.

బన్సీలాల్‌కు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. ఉన్న ఒక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తండాలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. శనివారం మధ్యాహ్నం అతని అంత్యక్రియలు పూర్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



వెంకటమ్మ (ఫైల్)

రాజాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. మండలంలోని మల్లెపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ (50) మండల కేంద్రంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న డీసీఎం వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. డీసీఎంతో పాటు డ్రైవరును పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఈ ప్రమాదంపై ఇప్పటి వరకు కేసు నమోదు కాలేదని తెలిపారు.

ఉరి వేసుకొని వలస కార్మికుడి ఆత్మహత్య

కోడేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఏదుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టిన మెగా కంపెనీలో పనిచేస్తున్న వలస కార్మికుడు చంద్రశేఖర్ సింగ్ (31) అనే వ్యక్తి చెట్టు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ ఖయ్యూం తెలిపిన వివరాల మేరకు... మండలంలోని తీగలపల్లి గ్రామ సమీపంలోని మెగా కంపెనీ క్యాంపులో గల చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం తోటి కార్మికులు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి వెళ్లి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

మృతుడు బిహార్ రాష్ర్టానికి చెందిన వ్యక్తిగా కంపెనీ ఉద్యోగులు తెలిపారు. కొంతకాలం క్రితమే పనిలో చేరినట్లు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని ఏఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముందే పారిన నీటితో.. సాగుకు సన్నద్ధం

- 20 ఏళ్ల తరువాత 3 నెలలు ముందుగా ఆర్‌డీఎస్‌కు నీరు
- నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్న ఆయకట్టు రైతులు



పులికల్ శివారులో వరి నాటుకు రైతులు సిద్ధం చేసుకుంటున్న నారు

అయిజ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌డీఎస్ పరివాహక ప్రాంత రైతులకు పండుగొచ్చింది. దాదాపు 20 ఏళ్ల తరువాత ఆర్‌డీఎస్ కాలువకు మూడు నెలలు ముందుగానే సాగునీరు విడుదలయ్యింది. సహజంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ప్రతి ఏటా వానాకాలం పంటకు ఏరు ముందో, ఏరువాక పండుగ ముందో అని చర్చించుకునేవారు. ఏరువాక పండుగ కంటే ముందే, ఏరు (తుంగభద్రానదికి వరద రావడం) ముందు వస్తే ఆ ఏడాది పంటలు సమృద్ధిగా పండుతాయని రైతుల విశ్వాసం. అటువంటి సందర్భం దాదాపు 20 ఏళ్ల తరువాత ఈ సంవత్సరం వచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

50 వేల ఎకరాల్లో సాగు అంచనా

అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని ఆర్‌డీఎస్ కింద 87,500 ఎకరాలు సాగవ్వాల్సి ఉంది. కానీ వివిధ కారణాలతో 30 నుంచి 35 వేల ఎకరాలకు మించి పంటలు సాగవడం లేదు. కానీ ఈ ఏడాది ముందస్తు నీటి విడుదలతో 45 నుంచి 50 వేల ఎకరాలకు వరకు పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతీ ఏటా జూలై 20 నుంచి వర్షాలు మొదలయ్యేవి. ఆగస్టు 20వ తేదీ నాటికి ఆర్‌డీఎస్ కాలువకు సాగునీరు వదిలేవారు. గత నెల 11న ఏరువాక పౌర్ణమి కాగా, ఈ ఏడాది ముందస్తు వర్షాలతో, కర్ణాటకలోని హోస్పేట్ డ్యామ్ పూర్తి స్థాయిలో నిండటం వల్ల మే 25వ తేదీ నుంచే ఆర్‌డీఎస్ కాలువకు సాగునీరు విడుదల చేశారు. దీంతో రైతులు వరి నారు సిద్ధం చేసుకుంటున్నారు. ఆగస్టు చివరి నాటికి ఆయకట్టు పరిధిలో వరి నాట్లు పూర్తి కానున్నాయి.

54 వేల క్యూసెక్కుల నీటి విడుదల

తుంగభద్ర డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 80 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. దిగువన ఉండే తుంగభద్ర నదిలోకి ప్రతీ రోజు 54 వేల క్యూసెక్కుల వరకు సాగు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. దీంతో రాజోళిబండ ఆనకట్ట వద్ద 11.5 అడుగుల మేర నీరు పారుతోంది. ఆనకట్ట ఎత్తు 8 అడుగులు కాగా, కట్టను ఎక్కి పారుతున్న 3.5 అడుగుల నీరు తుంగభద్ర నదిలో తుమ్మిళ్ల లిఫ్ట్, సుంకేసుల బ్యారేజీల వరకు వస్తున్నాయి.

ఆర్‌డీఎస్ కాలువ ప్రారంభమయ్యే సింధనూరు వద్ద 6.5 అడుగులు సాగునీరు ప్రవహిస్తోంది.

రాష్ట్రంలో ని పులికల్, ఆంధ్రప్రదేశ్‌లోని నాగులదిన్నె గ్రామాల మధ్య తుంగభద్ర నది మూడున్నర నుంచి నాలుగు అడుగుల మేర ప్రవహిస్తోంది.

సంతోషంగా ఉంది



ఆర్‌డీఎస్ కాలువ నిండుగా ప్రవహిస్తోంది. గత 20 ఏళ్లలో ఈ సమయంలో ఆర్‌డీఎస్ కాలువలో ఇంత నీటిని చూడలేదు. ఈ సంవత్సరం వరి పంటలు ముందుగానే వేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నాం. మా గ్రామంలోని రైతులందరు ఆర్‌డీఎస్ నీటి ఆధారంగానే పంటలు సాగు చేసుకుంటాం.

\- భీమన్న, రైతు, సింధనూరు

త్వరగా నిర్ణయం తీసుకోవాలి



ప్రస్తుతం ఆర్‌డీఎస్ కాలువ, టీబీ డ్యామ్, రాజోలిబండ ఆనకట్ట వద్ద నీరు పుష్కలంగా పారుతోంది. ముందస్తు వర్షాల కారణంగా డ్యామ్‌లోకి వరదనీరు రావటంతో ఆర్‌డీఎస్ రైతులకు మేలు జరిగిందని చెప్పవచ్చు. కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు త్వరగా నిర్ణయం తీసుకోవాలి. ఆర్‌డీఎస్‌కు సాగునీరు ఎప్పటి వరకు పారే అవకాశం ఉందనే విషయంపై అధికారిక ప్రకటన చేయాలి.

\- సీతారామిరెడ్డి, ఆర్‌డీఎస్ ఆయకట్టుదారుల సంఘం మాజీ చైర్మన్

మళ్లీ శంకుస్థాపనలు చేయడమేంటి?

- మంత్రులను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్
- స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమేనంటూ విమర్శ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి గతంలోనే అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారని, మళ్లీ దానికే ముగ్గురు సీనియర్ మంత్రులు శంకుస్థాపనలు చేయడం ఇదేం పద్ధతి అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ ప్రశ్నించారు. కొత్త పనులు తెచ్చి శంకుస్థాపనలు చేయాలని సూచించారు. కల్వకుర్తి పట్టణంలో తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసి శంకుస్థాపనలు చేసిన పనులను పూర్తి చేయాల్సిందిపోయి ప్రజలను మభ్యపెట్టి మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికే మంత్రులచే శంకుస్థాపనలు చేయిస్తున్నారని విమర్శించారు. గతంలోనే ఆమనగల్‌కు 50 పడకల ఆసుపత్రి మంజూరు చేయించి పనులు ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అనేక రోడ్లు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పూర్తి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు ఎందుకు కేటాయించడం లేదని ఆయన ప్రశ్నించారు. నల్లమల టైగర్‌గా చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి నల్లమల పిల్లిగా మారడాని విమర్శించారు. విలేకర్ల సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింగం విజయ్‌గౌడ్, నాయకులు కొండూరు గోవర్ధన్, సూర్యప్రకాశ్‌రావు, మనోహర్‌రెడ్డి, ఎముక జంగయ్య, వీరయ్య, సైదులు యాదవ్, తాహెర్‌అలీ, చిన్నా, కిషోర్, రామకృష్ణ ఉన్నారు.

చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న బూర్గుపల్లి కృష్ణయాదవ్

నారాయణపేట న్యూటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకున్నంత మాత్రాన రిజర్వేషన్లు అమలు అయినట్లు కాదని దానికి చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ దళపతి ఆర్.కృష్ణయ్య పోరాట ఫలితమే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో బీసీ డిక్లరేషన్‌లో రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించారని గుర్తు చేశారు. చట్టబద్ధత లేని ఆర్డినెన్స్‌ల ద్వారా బీసీలకు ఒరిగేదేమీ లేదని, గతంలో కేరళ, బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలని చేసిన ప్రయత్నాన్ని 50 శాతం రిజర్వేషన్లు సీలింగ్ విధానానికి వ్యతిరేకమవుతుందని కోర్టులు అడ్డుకున్న సంగతి తెలిసిందేన్నారు. సమావేశంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా అ. ధ్యక్షుడు ఎడ్ల కుర్మయ్య, గణేష్, వెంకటప్ప, గజలప్ప, రమేష్, నర్సింహులు, వెంకటయ్య, లక్ష్మప్ప, శ్రీనివాస్, రాము తదితరులున్నారు.

కొండారెడ్డిపల్లిలో సీఎం సతీమణి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న సీఎం సతీమణి ఎనుముల గీత

వంగూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన మండలంలో కొండారెడ్డిపల్లిలో ఆయన సతీమణి ఎనుముల గీత వివిధ ఆలయాల్లో పూజలు చేశారు. గ్రామంలో హనుమాన్, కోటమైసమ్మ ఆలయాల్లో ఆమె స్వామివారు, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, హిందుకుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల్లో ప్రముఖుల పూజలు



ఏపీ హైకోర్టు న్యాయాధికారికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలను శనివారం ప్రముఖులు దర్శించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కుసుమకుమార్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో పూజలు చేశారు. సాయంత్రం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయాధికారి వెంకటజ్యోతిర్మయి ప్రతాప్ ఆలయాలను దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో వారు ప్రత్యేకపూజలు చేశారు.

అసూయతోనే హత్య

- తేజేశ్వర్ హత్యలో కీలక విషయాలు వెల్లడి
- తిరుమల్‌రావు బ్యాంకు నుంచి వాయిస్ చేంజర్ డివైజ్ స్వాధీనం
- తిరుమల్‌రావు, ఐశ్వర్యను మరోసారి కస్టడీలోకి తీసుకుంటాం
- విచారణ అధికారి, సీఐ టంగుటూరి శ్రీను



వివరాలను వెల్లడిస్తున్న విచారణ అధికారి టంగుటూరి శ్రీను

గద్వాల క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఐశ్వర్య పెళ్లి చేసుకోవడంతో పాటు తేజేశ్వర్ తో శారీరకంగా కలిసి ఉండకూడదనే అసూయతోనే హత్య చేయించిన విషయాలను పోలీసులకు వెల్లడించినట్లు విచారణ అధికారి, సీఐ టంగుటూరి శ్రీను ఆధ్వర్యంలో వెల్లడి అయ్యాయి. తేజేశ్వర్ హత్యకు సంబంధించి పలు కీలక విషయాలు సీఐ శనివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తేజేశ్వర్ హత్యకేసులో గత నాలుగురోజుల క్రితం కోర్టు అనుమతితో ప్రధాన నిందితుడు తిరుమల్‌రావుతో పాటు డ్రైవర్ నాగేష్, సుపారి గ్యాంగ్ అయిన పరశురామ్, రాజును పోలీసులు కస్టడీలోకి తీసికొని విచారించి శనివారం మళ్లీ వారిని జైలుకు పంపించడం జరిగింది. అయితే కస్టడీలోకి తీసుకొని విచారించడంలో పలు కీలక అంశాలు బయటపడ్డా యి. ఇందులో తేజేశ్వర్‌ను చంపాల్సిన అవసరం ఏమొచ్చింది అనే అంశంపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారించినట్లు వెల్లడించారు. చంపకుండా కూడా ఐశ్వర్యను తీసుకెళ్తే పరిస్థితి ఇలా ఉండేది కాదని.. తెలిసినా ఎందుకు చంపారని పోలీసులు గట్టిగా మందలించడంతో అసలు విషయాలు వెల్లడి అయ్యాయి. ఇందుకు ప్రధాన కారణం అసూయనే అని తేలింది. ఐశ్వర్య తేజేశ్వర్‌ను పెళ్లి చేసుకోకుండా ఉండాల్సింది. అంతే కాకుండా ఆమె పెళ్లి చేసుకున్నా కూడా అతడితో కాపురం చేయడం.. ప్రియుడు తిరుమల్‌రావుకు ఏమాత్రం ఇష్టం లేదు. ఐశ్వర్యను తానే పెళ్లి చేసుకుందామనుకున్న తరుణంలో ఆయన భార్య ఒప్పుకోలేదు. తనకు ఇష్టమైన దానిని ఎవరు అనుభవించకూడదనే ఉద్దేశంతో వారు పెళ్లి చేసుకున్నప్పటికీ ఒక్కటి కాకుండా ప్రతీ విషయంలో జాగ్రత్త పడ్డాడు. ఈ విషయంపై తేజేశ్వర్‌తో పెళ్లి చేసుకున్నప్పటికీ వారు శారీరకంగా కలిసేందుకు నెల గడువు ఐశ్వర్య కోరేలా ప్రియుడు ప్రేరేపించాడు. ఆ నెలలోనే తేజేశ్వర్‌ను అడ్డుతొలగించేందుకు అన్ని ప్రయత్నాలు జరిగాయి. అంతేగాక ఐశ్వర్య ఇంట్లో జరిగే ప్రతి విషయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు తిరుమల్‌రావు ప్రత్యేకంగా వాయిస్ చేంజర్ డివైజ్‌ను వాడినట్లు పోలీసుల విచారణలో తేలింది. గత రెండు రోజుల క్రితం తిరుమల్‌రావు పనిచేస్తున్న బ్యాంకులో ఆ డివైజ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే ఈ డివైజ్ ఆధారంగా ఆడ మనిషి మాట్లాడినట్లు మాట్లాడి ఇంట్లో ఉన్న ఐశ్వర్యతో తేజేశ్వర్ మర్డర్‌కు సంబంధించి అన్ని విషయాలను ప్రతిరోజు వెల్లడించినట్లు తెలిసింది. అంతేగాకుండా సర్వేయర్ తేజేశ్వర్ ప్రతి రోజు ఎక్కడికి వెళ్లాడు... ఎన్ని గంటలకు వెళ్లాడు... మళ్లీ ఎప్పుడు తిరిగివస్తాడు... అనే విషయాలతో పాటు ఎవరెవరి దగ్గర ఎక్కువగా ఉంటాడనే ప్రతి దాన్ని ఐశ్వర్య తన ప్రియుడు అయిన తిరుమల్‌రావు కు తెలుపుతూనే ఉన్నట్లు పోలీస్ విచారణలో తేలింది. ఈ క్రమంలోనే హతుడి కదలికలను ఐశ్వర్య ద్వారా తెలుసుకున్న ఆమె ప్రియుడు తిరుమల్‌రావు తేజేశ్వర్ హత్య సులభంగా జరిగేలా చేసింది. అంతేకాకుండా పోలీసులకు ఇంకా పూర్తిస్థాయిలో సమాచారం రాకపోవడంతో ఈ హత్యకు సంబంధించి ప్రియుడితో పాటు తేజేశ్వర్ భార్యను, ఐశ్వర్యను మళ్లీ కస్టడీలోకి తీసుకునేలా కోర్టు అనుమతి కోరుతున్నట్లు ఇన్వెస్టిగేషన్ అధికారి, సీఐ టంగుటూరి శ్రీను తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆవాజ్ మహాసభలను జయప్రదం చేయాలి


ప్రచారం చేస్తున్న సంఘం నాయకులు

కొత్తకోట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గద్వాల పట్టణంలో ఆదివారం కొనసాగనున్న ఆవాజ్ మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ ముస్లిం సంఘం అధ్యక్షుడు లతీఫ్, ప్రధాన కార్యదర్శి సుల్తాన్ అన్నారు. శనివారం మైనార్టీ కాలనీలో ఆవాజ్ మహాసభల ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలను కలుసుకొని మతసామర్యం, ప్రజాస్వామ్యం పరిరక్షించుకోవాలని అందుకోసం ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గఫార్, నిక్సన్, ఖాజామైనోద్దీన్, ఫజల్, షబ్బీర్, అహేమద్, సయ్యద్,మొయిన్, అజీమోద్దీన్, మతీన్, చాంద్‌పాష, కాలీద్, ఖదీర్ తదితరులు ఉన్నారు.

జిల్లా సభల ఏర్పాట్ల పరిశీలన


సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పెబ్బేరు, జూలై 12(ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ జిల్లా మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. పెబ్బేరులో 14, 15న నిర్వహించనున్న జిల్లా మహాసభల ఏర్పాట్లను శనివారం ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు ఎండీ జబ్బార్, బాలయ్య, రైతు సంఘం నాయకులు భాస్కర్‌లతో కలిసి పరిశీలించారు. జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు జిల్లా మహాసభలకు తరలిరావాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి పెద్దఖాజా, రమేష్, వీరస్వామి తదితరులున్నారు.

బీడీ కార్మికులకు పింఛన్లు ఇవ్వాలి

ఆత్మకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికులందరికీ పింఛన్ వర్తింపజేయాలని ఏఐటీయూసీ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి మోష ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2018 ఎన్నికల సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ బీడీ కార్మికులందరికీ పెన్షన్ వర్తింపజేస్తామని పీఎఫ్ కలిగిన బీడీ కార్మికులకు పింఛన్ వర్తింపజేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో పీఎఫ్ తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పెన్షన్లు వర్తింపజేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికే వర్తింపజేయడం లేదని డిమాండ్ చేశారు. తక్షణమే తెలంగాణ పింఛన్ వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు అమరచింతకు మంత్రి శ్రీహరి రాక

అమరచింత, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాల కోసం ఆదివారం మంత్రి వాకిటి శ్రీహరి అమరచింతకు రానున్నారని కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు అమరచింత హై స్కూల్ గ్రౌండ్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు గదులు, సింగంపేటలో ఎన్ఆర్ఈజీఎస్, 15వ ఫైనాన్స్ ద్వారా రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు గదులను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించనున్నారని తెలిపారు. మంత్రితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ కల్లుగీత కార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ పలువురు నాయకులు వస్తున్నారని, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రి కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పాలక ప్రభుత్వాలు చెరుకు రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న పేర్కొన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... చెరుకు రైతులు వేరు పురుగుతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. వేరు పురుగు నివారణ కోసం ఆత్మకూరు జోనల్ కార్యాలయంలో మందులు అందుబాటులో ఉన్నాయని కావాల్సి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో చెరుకు రైతు సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటామని అన్నారు.

ప్రాజెక్టు రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ఆత్మకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నందిమల్ల మూలమల్ల గ్రామాల రైతులు ఒక ప్రకటనలో కోరారు. కృష్ణా పుష్కరాల నిమిత్తం మంజూరైన రోడ్డు మరమ్మతులు ఇప్పటికీ చేపట్టకపోవడం సరైనది కాదని పేర్కొన్నారు. అలాగే ప్రాజెక్టు సందర్శన నిమిత్తం ఉమ్మడి జిల్లా నుంచి సందర్శకులు రోజు వారీగా వేల సంఖ్యలో తరలి వస్తుంటారని, ఆత్మకూరు నుంచి మూలమల్ల, నందిమల్ల గ్రామాల మీదుగా ప్రాజెక్టును చేరుకునేందుకు ఆరు కిలో మీటర్ల మేర తగ్గుతుందని అధిక మొత్తంలో ఈ గ్రామాల మీదనే వెళ్తుంటారన్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రాజెక్టు వద్ద సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే 2023 ఎన్నికల సమయంలో మంత్రి వాకిటి శ్రీహరి రోడ్డు మరమ్మతులు చేపడతానని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన లేని కోతలు

- గంటల తరబడి విద్యుత్ అంతరాయం
- పల్లెల్లో అలుముకుంటున్న అంధకారం

పెబ్బేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు విద్యుత్తు కోతల వెతలు తప్పడం లేదు. కరెంట్ సరఫరా ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గాలులు వీచినా.. చినుకులు పడినా పల్లెల్లో అంధకారం అలుముకుంటుంది. అప్రకటిత విద్యుత్తు కోతలతో పల్లెజనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో దోమలతో అవస్థలు పడుతున్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయంతో వినియోగదారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

33/11కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలు..

మండలంలోని పెబ్బేరులోని ఉప కేంద్రంలో 5 ఎంవీఏ కెపాసిటీ లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 2, అయ్యవారిపల్లి 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్, గుమ్మడం 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మరు, పాత సుగూరులోని ఉప కేంద్రంలో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మరు 2, కంచిరావుపల్లిలోని ఉప కేంద్రంలో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మరు 2, ఇలా మండలంలో ఐదు 33/11కేవీ ఉప కేంద్రాలు పని చేస్తున్నాయి. తోమాలపల్లిలో నూతనంగా చేపడతున్న ఉప కేంద్రం పనులు నత్తనడకన కొనసాగుతన్నాయి. అయినా విద్యుత్తు కోతల అంతరాయం మాత్రం వినియోగదారులను వెంటాడుతున్నాయి.

- మండలంలో 18,439 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 4,010 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా.. 14,429 గృహ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయి. మండలంలో విద్యుత్తు ఉప కేంద్రాలున్నపటికీ అనధికార విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. రైతులు, మునిసిపాలిటీ కేంద్రంలో విద్యుత్తుపై ఆధారపడి జీవిస్తున్న చిరువ్యాపారులు ఇక్కట్లకు గురవుతున్నారు.


పెబ్బేరులోని 33/11కేవి విద్యుత్తు ఉప కేంద్రం

అంతరాయం లేకుండా సరఫరా చేస్తాం



వర్షాలు, గాలులు వస్తున్నప్పుడు మాత్రమే విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నాం. వర్షం, గాలులు ఆగిన వెంటనే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరిస్తున్నాం. రాత్రి వేళల్లో ఈదురు గాలులకు చెట్లు విరిగిపోయి కరెంట్ తీగలపైన పడడంతో విద్యుత్తు అంతరాయం కలుగుతుంది. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు కృషి చేస్తాం.

- శివశంకర్ రెడ్డి, ఏడీఈ విద్యుత్తు శాఖ అధికారి, కొత్తకోట

కేంద్రంలో కార్మిక, కర్షకుల వ్యతిరేక పాలన

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు



సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు

అమరచింత, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలు అన్నింటిని నిర్వీర్యం చేసిన మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షకుల వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో జరిగిన సీపీఐ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక వైపు దేశంలో కార్మికుల, రైతుల, సామాన్య ప్రజల వ్యతిరేక పాలన అందిస్తున్న మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తయిందని బీజేపీ నాయకులు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల అమలుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుంటే సీపీఐ క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన పోరాడుతుందని అన్నారు. సదస్సులో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అబ్రహం, రవీందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, గోపాలకృష్ణ, రమేష్, రాబర్ట్, భాస్కర్, శ్యాంసుందర్, కుతుబ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏజెన్సీ విధానం రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్


మహాధర్నాకు వెళ్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకులు

వనపర్తి వైద్యవిభాగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం తరహాలో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి రమేష్ అన్నారు. శనివారం తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్, ట్రేడ్ యూనియన్ స్టేట్ నాయకులు పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహింస్తున్న మహాధర్నాకు జిల్లా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని, ప్రతీ నెల 5వ తేదీలోపు వేతనాలు అందించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రతీ ఒక్క అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకులు తిరుపతయ్య, లక్ష్మీపతి, సంతోష్, అంజి, కార్తీక్, గంధం శ్రీనివాసులు, సురేఖ, గౌడనాయక్, ఖాజా హుస్సేన్, విక్రం, రాజశేఖర్, కవిత, వెంకటేష్, హరీష్, గోపాల్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సామ రామ్మోహన్ రెడ్డిని కలిసిన ఆర్టీఐ చైర్మన్

గోపాల్‌పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఆర్టీఐ చెర్మన్ కొంకి రమేష్, రాష్ట్ర టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చెర్మన్ సామ రామ్మోహన్ రెడ్డిని కలిశారు. శనివారం కోత్తకోట హైవేపై వెళ్తున్న వారిని మండల కేంద్రానికి చెందిన ఆర్టీఐ చెర్మన్ కొంకి రమేష్ మర్యాదపూర్వకంగా కలశారు. ఈ సందర్భంగా నాయకులు టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చెర్మన్ సామ రామ్మోహన్ రెడ్డిని సన్మానించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. సోషల్ మీడియాలో ప్రభుత్వం పైవస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని అన్నారు.


సామ రామ్మోహన్‌రెడ్డితో రమేష్

42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

- గట్టు యాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గట్టు యాదవ్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్డినెన్స్ ఆపి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను కప్పిపెట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ఓట్లు కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఆర్డినెన్స్ అంటూ మరోసారి మోసం చేస్తుందన్నారు. 50 శాతం బీసీ జనాభా దాటితే తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. మీ లెక్కల ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు ఉన్నప్పుడు ఎందుకు చట్టబద్ధత కల్పించడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణ, పార్లమెంట్ ఆమోదం తరువాతనే బీసీ రిజర్వేషన్లు అమలు అవుతాయని తెలిసి కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీని బదనాం చేయడానికి కొత్త నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. పలుస రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం పైగా బీసీలు పోటీ చేస్తున్నారని వారు విధులు నిధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మిగిలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నందిమల్ల అశోక్ మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి తప్పించుకుని బీసీల ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కుయుక్తులు, కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. శ్రీధర్, కురుమూర్తి, విజయ్ కుమార్, రాములు, వేణుయాదవ్, బాలరాజు, పృథ్వీనాథ్, స్వామి, ఈశ్వర్, శ్రీను, కృష్ణ, వంశీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వర్‌రెడ్డికి మాజీ మంత్రి పరామర్శ


పరామర్శిస్తున్న నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా రైతు సమితి మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డిని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి శనివారం పరామర్శించారు. అనారోగ్యానికి గురై పెద్దమందడిలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జగదీశ్వర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి వెంట నాయకులు సేనాపతి, పురుషోత్తంరెడ్డి, రమేష్, కురుమూర్తి, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రేవల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలను గుర్తించి అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. మండలంలోని బండరావిపాకులలో బీజేపీ మండల అధ్యక్షుడు బాలునాయక్, నాయకులు గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను అదే విధంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం ఎంపీడీవో నరసింహకు వినతి పత్రం అందజేశారు. లింగస్వామి, రాము, పవన్‌కుమార్, అజయ్‌గౌడ్ ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై హర్షం

మదనాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను పెంచడానికి క్యాబినెట్ ఆమోదం తెలపడంపై దేవరకద్ర నియోజకవర్గం అధ్యక్షుడు వడ్డె కృష్ణ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2018 చట్టంను సవరించి బీసీలకు న్యాయం చేసే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. దీంతో కింది స్థాయి వర్గాలు చట్ట సభల్లో అడుగు పెట్టడానికి మెరుగైన అవకాశం ఉంటుందన్నారు.

అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాల గౌడ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పెబ్బేరు మండల కేంద్రంలో ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, కార్యదర్శి పాలడుగు భాస్కర్, ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయంతం చేయాలని కోరారు.

అంబులెన్సులో ప్రసవం

చిన్నంబావి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కాలూర్‌కి చెందిన నాగజ్యోతి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చింది. చిన్నంబావి మండల అంబులెన్స్ సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకొని సీహెచ్‌సీ వీపనగండ్ల ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు తీవ్రమయ్యాయి. ఈఆర్‌సీపీ డాక్టర్ సారథితో కలిసి ఈఎంటీ నరేందర్ కాన్పు చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని టెక్నీషియన్ నరేందర్, పైలెట్ రాఘవేంద్ర, ఆశ వర్కర్ పుష్ప తెలిపారు.

పెరట్లో సేంద్రియ ఎరువులతో కూరగాయలు సాగు

- ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ భాస్కర్


పెరటి కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యాన కళాశాల విద్యార్థులు

పెద్దమందడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పెరట్లో సేంద్రియ ఎరువుల ద్వారా సాగు చేసుకొని తినడంతో మంచి ఆరోగ్య వస్తుందని కళాశాల అధ్యాపకులు భాస్కర్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల మోజర్ల ఆధ్వర్యంలో జాతీయ సేవ పథక ప్రత్యేక శిబిరంలో రెండో రోజు కళాశాల విద్యార్థులు, పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వీధులను ఊడ్చి శుభ్రం చేశారు. గ్రామస్థులకు పచ్చదనం పరిశుభ్రత, స్వచ్ఛ భారత్ గురించి అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ మన్యం, జైపాల్‌రెడ్డి వారి పేరట్లో కిచెన్ గార్డెన్ కూరగాయల విత్తనాల ప్రదర్శన చేసి అవగాహన కల్పించారు. అనంతరం పది మంది రైతులకు కిచెన్ గార్డెన్ విత్తనాల కిట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.భాస్కర్ మాట్లాడుతూ వయ్యారి బామ మొక్కలను సామూహికంగా పూత దశకు రాకముందే తొలగించినట్లయితే వాటి నుంచి వచ్చిన సమస్యలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో 26 మంది ఉద్యాన విద్యార్థులు, మాజీ సర్పంచ్ మన్యం, జైపాల్‌రెడ్డి, గట్టు కృష్ణయ్య, గట్టురాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ షాపులో పాము కలకలం


పామును చూడటానికి గుమిగూడిన స్థానికులు

అమరచింత, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కీర్తి ఎలక్ట్రానిక్ షాపులో శనివారం పాము కలకలం సృష్టించింది. ప్రధాన రహదారిపై ఉన్న కీర్తి ఎలక్ట్రానిక్ షాపు మధ్యాహ్నం మూసి ఉండడంతో అటు నుంచి పెద్ద పాము షాపులోకి చొరబడింది. దీంతో చుట్టు పక్కల వారు గమనించి షాప్ యజమాని ఎర్రన్నకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చి యజమాని చుట్టుపక్కల వారితో కలిసి దుకాణం తెరిచారు. పాములు వ్యక్తికి సమాచారం ఇవ్వగా.. అతను పామును పట్టుకున్నాడు.

అవసరాలకు అనుగుణంగా వసతుల కల్పనకు కృషి

- ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవన్న నాయుడు

వనపర్తి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల దేవన్న నాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని 1వ వార్డు రాయిగడ్డలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీవాసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో అధిక నిధులు తీసుకొచ్చి పట్టణ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధిని మరిచారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 19 నెలల్లోనే శరవేగంగా పట్టణంలోని ప్రతి వార్డులో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయని అన్నారు. నిర్మాణ పనులను నాణ్యవంతంగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలనీవాసులు ఉందేకోటి శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న నాయకులు

కళాశాలల కనీస సౌకర్యాల నిర్వహణకు నిధులు విడుదల

వనపర్తి విద్యావిభాగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలల కనీస సౌకర్యాల నిర్వహణకు రూ.2.30 లక్షల నిధులను ఇంటర్మీడియట్ విద్యా డైరెక్టర్ కృష్ణ ఆదిత్య విడుదల చేశారు. జూన్, జూలై నెలల కళాశాలల కనీస సౌకర్యాల నిర్వహణ కోసం ఈ నిధులు మంజూరు చేసి ప్రిన్సిపాల్స్ ఖాతాలకు జమ చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకోట కళాశాలకు రూ.16 వేలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వనపర్తికి రూ.40 వేలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వనపర్తికి రూ.30 వేలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ మీడియంకు రూ.12 వేలు, పాన్‌గల్ కళాశాలకు రూ.16 వేలు, పెద్దమందడి కళాశాలకు రూ.16 వేలు, ఖిల్లాఘణపురం కళాశాలకు రూ.16 వేలు, ఆత్మకూరు కళాశాలకు రూ.24 వేలు, పెబ్బేరు కళాశాలకు రూ.12 వేలు, శ్రీరంగాపూర్ కళాశాలకు రూ.16 వేలు, వీపనగండ్ల కళాశాలకు రూ.16 వేలు, గోపాల్‌పేట కళాశాలకు రూ.16 వేలు మంజూరయ్యాయని తెలియజేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మండల నాయకులు


రామచంద్రరావును సన్మానిస్తున్న నాయకులు

కొత్తకోట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన బీజేపీ నాయకులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైనా రామచంద్రరావును హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో శనివారం కలిసి శాలువాతో సన్మానం చేసినట్లు తెలిపారు. సన్మానం చేసిన వారిలో దేవరకద్ర నియోజకవర్గం పార్టీ కోకన్వీనర్ భరత్ భూషణ్, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు నరసింహ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'బీసీ రిజర్వేషన్లను ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు'


వనపర్తి టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే బీఆర్ఎస్ పార్టీకి పుట్టగతులు ఉండవని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు వనపర్తిలో ముఖం చూపించుకోలేక తెలంగాణ భవన్‌కి వెళ్లి కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై లేనిపోని విమర్శలు చేస్తు కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. బీసీ వ్యతిరేకి అయిన మాజీ మంత్రి సూచనలతో వనపర్తిలోని నాయకులు అలజడి సృష్టించాలని అనుకుంటే అది వారి అజ్ఞానమే అవుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లను సమర్థించిన కల్వకుంట్ల కవిత మీ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గతంలో బీసీలపై 28 కేలుసు పెట్టిన చరిత్ర మాజీ మంత్రిదని, సాక్షాత్తు బీఆర్ఎస్ మీడియా కన్వీనర్‌పైనే 7 కేసులు పెట్టించాడని బీసీ గర్జన సభలో చెప్పిన మాటలను ఆయన గుర్తు చేశారు.

గిరిజనుల పోడు భూముల విషయంలో బీసీ నాయకుడు గొల్ల వెంకటయ్య పోరాటం చేస్తే ఆయనపై నాన్ బెయిల్ కేసు పెట్టించి పైశాచిక ఆనందం పొందిన వ్యక్తి మీ బీఆర్ఎస్ నాయకుడు కాదా అని అన్నారు.

ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏవీ?

24 గంటలు వెలుగుతున్న విద్యుత్ దీపాలు

ఖిల్లాఘణపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పలు కాలనీల్లో శనివారం పగటి వేళ విద్యుత్ వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధి దీపాలు ప్రతీ రోజు 24 గంటల పాటు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోకపోవడంతో విద్యుత్ దుర్వినియోగం అవుతుంది. గ్రామ, పట్టణాల్లో వినియోగదారులకు విద్యుత్ వాడకం లేకుండా జీవించడం కష్టతరంగా మారింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించడంతో గ్రామాల్లో విద్యుత్ వినియోగం పెరిగింది. ప్రభుత్వం నిరంతరం విద్యుత్ సరఫరా చేయడానికి కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం వెచ్చించి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. వీధి దీపాలకు ఆన్ , ఆఫ్ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీధి దీపాల విద్యుత్ బిల్లులు చెల్లించడానికి గ్రామ పంచాయతీలపై అదనపు భారంగా పడుతుంది. మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో పల్లెల్లో కూడా పట్టపగలు వీధి దీపాలు వెలుగుతున్నా.. వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి పట్ట పగలు విద్యుత్ దీపాలు వెలగకుండా ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఖిల్లాఘణపురంలో వెలుగుతున్న వీధి లైట్